


బుధవారం తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ డైరీని ఆవిష్కరిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు, మధుసూదనాచారి, సబితాఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బండాప్రకాశ్, పొన్నాల లక్ష్మయ్య, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, శంకర్ నాయక్, రేగా కాంతారావు, కర్నె ప్రభాకర్ తదితరులు

## లోకం పోకడ




అమెరికా నుంచి వస్తున్నార్లే!

# కేసులతో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే కుట్ర

- పోరాటాలు బీఆర్‌ఎస్‌కు కొత్తకాదు
- తెలంగాణపై విషం కక్కుతున్న కాంగ్రెస్
- మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి ఆగ్రహం
- తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ డైరీ-2025 ఆవిష్కరణ

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ) బీఆర్‌ఎస్ ముఖ్య నేతలపై కేసులు పెట్టి ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ కుట్ర చేస్తున్నదని శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణభవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన బీఆర్‌ఎస్ పార్టీ డైరీ-2025 ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 ఏండ్లు చరిత్రాత్మక పోరాటం చేసిందని గుర్తుచేశారు. పోరాటాలు, కేసులు తమకు కొత్తేమీకాదని, ఎన్ని కేసులు పెట్టినా భయపడబోమని స్పష్టంచేశారు. కేసీఆర్ నాయకత్వంలో గతపదేండ్లలో రాష్ట్రంలో స్వర్ణయుగం కొనసాగిందని చెప్పారు. దొంగ హామీలిచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణపై విషం కక్కుతున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల్లో కారుచీకట్లు కమ్ముకున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. హామీలు అమలు చేయకపోతే సర్కార్‌కు ప్రజాకోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు. అణచివేతతో దుర్మార్గపు వైఖరితో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. 2025 సంవత్సరాన్ని సవాల్‌గా స్వీకరించాలని, ఏ ఒక్కరిపై ఈగ వాలి నా పార్టీ శ్రేణులు ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

**రివేంజ్‌రెడ్డిది డైవర్షన్ డ్రామా: మహమూద్ అలీ**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. రివేంజ్‌రెడ్డిగా మారి బీఆర్‌ఎస్ నేతలపై కక్షపూరితంగా అక్రమ కేసులు పెట్టి పైశాచికానందం పొందుతున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ విమర్శించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేకే ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు సకల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రైతు భరోసా కింద ఏటా 15 వేలు ఇస్తామని 12 వేలే చేయడంతో అన్నదాతలు నిలదీస్తున్నారని.. వారిని డైవర్ట్ చేసేందుకు డ్రామా ప్లే చేస్తున్నారని విమర్శించారు.

**రేవంత్‌పై ప్రజా వ్యతిరేకత: కొప్పుల ఈశ్వర్**

అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ఇంత తక్కువ కాలంలోనే ప్రభుత్వాన్ని ప్రజలు తిట్టడం ఎప్పుడూ, ఎక్కడా చూడలేదని ఎద్దేవా చేశారు. గతంలో అనేక మంది ముఖ్యమంత్రులను చూశాం కానీ, ప్రతిపక్ష పార్టీల నేతలను కక్షపూరితంగా ఇబ్బందులకు గురిచేయడం, ప్రజలను వంచించడం ఒక్క తెలంగాణలోనే జరుగుతున్నదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీని ఇబ్బంది పెడుతుండటంతో కాంగ్రెస్ పార్టీని గెలిపించి తప్పు చేశామనే భావన ప్రజల్లో వ్యక్తమవుతున్నదని తెలిపారు. ఫార్ములా-ఈ రేస్‌లో అవకతవకలు జరిగితే.. అసెంబ్లీలో ఎందుకు చర్చ పెట్టలేదని నిలదీశారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి పని చేస్తున్నాయని, కాంగ్రెస్ నేతలు బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తే బీజేపీ నేతలు బీఆర్‌ఎస్‌ను తిట్టడం చూసి ప్రజలు ఛీకొడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ నేత ధర్మపురి అర్వింద్ కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు.

**అక్రమ కేసులు: సత్యవతి రాథోడ్**

బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రజల పక్షాన నిలబడుతున్నందుకే అక్రమ కేసులు పెడుతున్నారని మాజీమంత్రి సత్యవతి రాథోడ్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి హామీలు, వైఫల్యాలను క్యాలెండర్ రూపంలో ముద్రించి ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు.

**డైవర్షన్ పాలిటిక్స్‌ను ఎదుర్కొంటాం: వేముల**

బీఆర్‌ఎస్ పార్టీపై కక్ష సాధింపుతో రేవంత్‌రెడ్డి చేసే డైవర్షన్ పాలిటిక్స్‌ను ధీటుగా ఎదుర్కొంటామని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. 2025లో కాంగ్రెస్ పాలిట ప్రతి బీఆర్‌ఎస్ కార్యకర్త సింహస్వప్నంలా మారాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పుట్టిందే రాష్ట్ర సాధన, అభివృద్ధి కోసమని స్పష్టంచేశారు. పదవులను త్యాగం చేసి కేసీఆర్ తెలంగాణ ప్రజల కోసం పార్టీని పెట్టారని, 14 ఏండ్ల పోరాటం తర్వాత తెలంగాణకు తొలి సీఎం అయ్యి దేశానికి దిక్సూచిలా మార్చారని వెల్లడించారు. రేవంత్‌రెడ్డి అలవి కాని హామీలతోనే అధికారంలోకి వచ్చారని, ప్రశ్నిస్తే జైల్లో పెట్టే కార్యక్రమాన్ని మొదలుపెట్టారని ఆరోపించారు.

### కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయినప్పుడల్లా డైవర్షన్: సబితా ఇంద్రారెడ్డి

ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేకపోయిందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. ప్రజల్లో కాంగ్రెస్ సర్కార్ గ్రాఫ్ పడిపోయినప్పుడల్లా ఏదో ఒక కేసు ద్వారా ప్రజలను డైవర్ట్ చేస్తున్నారని విమర్శించారు. నాడు తాను అధికార పార్టీలో ఉండి కేసీఆర్ తెలంగాణ కోసం చేసిన పోరాటాన్ని దగ్గరి నుంచి చూశానని, నిమ్స్ దవాఖానలో కేసీఆర్ దీక్షను విరమించమని కోరితే, పార్టీ, పదవుల కోసం కాదు.. తెలంగాణ కోసం చేస్తున్నానని ప్రభుత్వానికి చెప్పమన్నారని గుర్తుచేశారు. రాష్ట్రాన్ని సాధించాక దేశానికే ఆదర్శంగా నిలిపారని కొనియాడరు. రేవంత్‌రెడ్డి పాలనను గాలికొదిలి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

# రాష్ట్రంలో త్రీడీ పాలన

మొదటిపేజీ తరువాయి...

సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కొందరు వక్తలు ఇబ్బందేదో ఉన్నట్టు చెప్పారు. కానీ, నిజానికి మనకు ఇబ్బందేమీలేదు. 2001లో కేసీఆర్ పార్టీ పెట్టిన రోజున ఉండే ఇబ్బందులతో పోల్చితే.. ఇది ఇబ్బందే కాదు. కేసీఆర్ ఆనాడు కడుపు మాడ్చుకొని తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ జైత్రయాత్రనో.. కేసీఆర్ శవయాత్రనో అని కూర్చున్నప్పటి ఇబ్బంది ముందు ఇదేం ఇబ్బంది? తెలంగాణ ఉద్యమ సమయంలో ఓయూలో బాల్క సుమన్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో పాటు పలువురు విద్యార్థి నేతల వీపులపై లాఠీలు విరిగాయి. పోలీసుల లాఠీ దెబ్బలకు శరీరాలు కమిలిపోయాయి. యాదయ్య, శ్రీకాంతాచారి ఒంటి మీద పెట్రోల్ పోసుకుని భగభగ మంట మండుతుంటే ఆ ఇబ్బంది ముందు ఇదేం ఇబ్బంది? కేసీఆర్ పార్టీ పెట్టినప్పుడు మజిల్ పవర్, మీడియా పవర్ లేదు. అగమ్య గోచర పరిస్థితుల్లో తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసి చావునోట్లో తల పెట్టి తెలంగాణ తెచ్చిన నాయకుడు కేసీఆర్. అలాంటి కేసీఆర్ తయారు చేసిన సైనికుడిగా, కేసీఆర్ రక్తం పంచుకుపుట్టిన బిడ్డగా ఈ అక్రమ కేసుకు భయపడుతమా? ఇది ఇబ్బంది కానేకాదు. ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. మనకు మంచి లాయర్లు ఉన్నరు. బీఆర్‌ఎస్ లీగల్ టీమ్ ఉన్నది. న్యాయస్థానాల్లో కొట్లాడుదాం. తప్పు చేయలేదు కాబట్టి ఎవ్వరికీ బయపడేది లేదు' అని కేటీఆర్ స్పష్టంచేశారు.

> రైతులకు, తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, ప్రభుత్వం చేసిన మోసంపై ఏడాదంతా మాట్లాడుదాం.. నిలదీద్దాం.. అంతేగాని నాపై పెట్టిన అక్రమ కేసు గురించి ఎవరూ ఆలోచించాల్సిన అవసరం లేదు. ఈ అక్రమ కేసుపై నేను చట్టప్రకారం కొట్లాడుతా. తప్పు చేయనప్పుడు ఎవ్వరికీ బయపడేది లేదు. హైదరాబాద్ కోసం, తెలంగాణ కోసం తీసుకున్న నిర్ణయాలే అన్నీ. ఈ అక్రమ కేసుకు ఎవరూ భయపడాల్సిన పనిలేదు. - కేటీఆర్

**బూత్‌స్థాయి నుంచి కమిటీలు**

త్వరలోనే పార్టీ సభ్యత్వ నమోదు, కొత్త కమిటీలు ఏర్పాటు చేసుకుందామని కేటీఆర్ చెప్పారు. బూత్, గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలు ఏర్పాటు చేద్దామని తెలిపారు. జిల్లా నాయకులు హైదరాబాద్ రావడం కాదని, తామే జిల్లాలకు వస్తామని చెప్పారు. కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిద్దామని తెలిపారు. 60 లక్షల మంది సభ్యులున్న అతిపెద్ద బీఆర్‌ఎస్ కుటుంబం మనదని స్పష్టంచేశారు.

**హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి**

**తెలంగాణ** ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై నిలదీయాలని శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. లగచర్ల రైతులు తమ భూమి గుంజుకోవద్దనందుకు 40 రోజులు జైల్లో అక్రమంగా పెట్టిన దానితో పోల్చితే ఇప్పుడున్న ఇబ్బందికర పరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించారు. ఇబ్బందిలో ఉన్నామనుకోవద్దని, రైతులను చైతన్యపర్చాలని, కాంగ్రెస్ మోసాన్ని ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి రైతుకు ఒక్కో ఎకరానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15 వేలు బాకీ ఉన్నదని చెప్పాలి. దేవుళ్లపై ఒట్లు వేసి రుణమాఫీపై మాట తప్పారని చెప్పాలి. రైతు రుణమాఫీ, కౌలు రైతులకిచ్చిన కాంగ్రెస్ హామీలపై నిలదీయాలి. రైతులకు, ప్రజలకిచ్చిన హామీల అమలు, ప్రభుత్వ మోసంపై ఏడాదంతా మాట్లాడుదాం. కొట్లాడుదాం' అని కేటీఆర్ స్పష్టంచేశారు. రాష్ట్రంలో త్రీడీ పాలన (డిసెప్షన్, డిస్ట్రాక్షన్, డిస్ట్రక్షన్.. మోసం, విధ్వంసం, విస్మరణ) కొనసాగుతున్నదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో 90 లక్షల మంది మహిళలకు నెలకు రూ.2500 చొప్పున ఇస్తున్నామని ఢిల్లీ కాంగ్రెస్ నేతలు కూడా అబద్ధాలు చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ కోసం అందరం కలిసి నడుద్దామని పిలుపునిచ్చారు.

**నాడు ఉద్యమానికి ఊతం: హరీశ్**

నాడు డైరీ ఆవిష్కరణ కార్యక్రమాలు తెలంగాణ ఉద్యమ సభలుగా విల్లసిల్లాయని, ఉద్యమానికి గొప్ప ఊతమిచ్చాయని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. పార్టీ డైరీని తిరగేస్తుంటే 14 ఏండ్ల ఉద్యమ ప్రస్థానం, విజయాలు కండ్ల ముందు కనిపిస్తున్నాయని తెలిపారు. పార్టీ ప్రతి నేత, కార్యకర్తలు ఈ డైరీని తమ దగ్గర పెట్టుకోవాలని సూచించారు. ఆనాటి డైరీ ఆవిష్కరణ సభలు రాష్ట్ర సాధనకు ఉపయోగపడితే, నేటిసభ బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని తెలపడానికి, తిరిగి అధికారంలోకి తెచ్చుకోవడానికి ఉపయోగపడాలని కోరారు.

**కోతలు, ఎగవేతలు, కేసులు**

సీఎంగా రేవంత్‌రెడ్డి ఏడాది పాలన ముగిసిందని, ఏడాదిలో ఏమన్నా చేసింద్రా అంటే.. కోతలు, ఎగవేతలు, కాదంటే కేసులు తప్ప ఏమీలేవని హరీశ్ ఎద్దేవా చేశారు. 'ఎగ్గొట్టినోన్ని ఎగ్గొట్టిండు అంటే కూడా తప్పేనా? 'ఎగవేతల రేవంత్‌రెడ్డి అన్నందుకు మానకొండురు పోలీస్‌స్టేషన్లో నామీద కేసు పెట్టిండు. పోలీస్‌స్టేషన్‌కు రమ్మని నాకు నోటీసులు వస్తున్నయి. ఎగవేతలు నిజం కాదా? ఏడాదిలో ఏం చేసినవు?' అని నిలదీశారు.

> లగచర్ల గిరిజన రైతులకు కేటీఆర్ అండగా నిలబడి కొట్లాడారు. కేటీఆర్ మీద కేసు అంటే ఒక ప్రశ్నించే గొంతుపై, ఒక ఉద్యమకారుడిపై పెట్టిన కేసు. ఇవ్వాళ రేవంత్ సర్కార్ గ్రాఫ్ దిగజారిపోతున్నందున ఇలాంటి కేసులు పెట్టి ప్రజలను డైవర్షన్ చేస్తున్నడు. ప్రతి నాయకుడికి, కార్యకర్తకు ఆపదొస్తే బీఆర్‌ఎస్ ఎట్లా అండగా నిలుస్తదో.. అలానే పార్టీ మొత్తం కేటీఆర్ వెంట ఉంటది. -హరీశ్‌రావు

**పిల్లలు పుట్టాక కల్యాణలక్ష్మి చెక్కులు**

ఎన్నికల ముందు పెండ్లి కాకముందే కల్యాణలక్ష్మి చెక్కు, తులం బంగారం ఇస్తామని చెప్పారని, ఇప్పుడు పిల్లలు పుట్టాక కూడా ఇవ్వడం లేదని హరీశ్ మండిపడ్డారు. ఎంతోమంది లబ్ధిదారులుంటే కొందరికే.. అదీ పిల్లలు పుట్టాక చెక్కులు వస్తున్నాయని ఎద్దేవాచేశారు. 'జార్ఖండ్‌లో మహిళలకు 2,500 పింఛన్ ఇస్తామని చెప్పి, మొదటి నెలలోనే అక్కడి కొత్త సీఎం హేమంత్ సోరెన్ మాట నిలబెట్టుకున్నరు. రేవంత్‌రెడ్డి 100 రోజుల్లో ఇస్తానని బాండ్ పేపర్‌పై సంతకం పెట్టి, 13 నెలలు గడిచినా మహాలక్ష్మి అమలు చేయలేదు. మొదటి నెలలోనే 2 వేల పింఛన్‌ను 4 వేలు చేసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాట నిలబెట్టుకున్నది. రేవంత్‌రెడ్డి 40 లక్షల మంది అవ్వాతాతలకు 4 వేల ఆసరా పింఛన్ ఇవ్వకుండా మాట తప్పారు' అని దుయ్యబట్టారు.

> పార్టీ పెట్టినప్పుడు.. తెలంగాణ ఉద్యమకారులు పడిన ఇబ్బందులు, అమరవీరుల త్యాగాలతో పోల్చితే ఇప్పుడున్నది ఇబ్బందికర పరిస్థితేం కాదు. చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ తయారుచేసిన సైనికుడిని.. ఈ అక్రమ కేసుకు భయపడుతనా? - కేటీఆర్

**లగచర్ల రైతులకు అండగా నిలిచిన కేటీఆర్**

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ లగచర్ల గిరిజన రైతులకు అండగా నిలిచి న్యాయం చేశారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గ్రాఫ్ దిగజారిపోతున్నందున ఇలాంటి కేసులు పెట్టి ప్రజలను డైవర్షన్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి నాయకుడికి, కార్యకర్తకు ఆపదొస్తే బీఆర్‌ఎస్ ఎలా అండగా నిలబడిందో అలానే పార్టీ మొత్తం కేటీఆర్ వెంట ఉంటుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సునీతా లక్ష్మారెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, రెడ్యానాయక్, శాసనమండలిలో డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు వంటేరు యాదవరెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ముఠా గోపాల్, పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్‌జాదవ్, మాజీ ఎంపీలు లింగయ్యయాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, కవిత, మాజీ ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, బాల్క సుమన్, నలమోతు భాస్కర్‌రావు, రసమయి బాలకిషన్, రేగా కాంతారావు, కోరుకంటి చందర్, నాయకులు కర్నె ప్రభాకర్, వంటేరు ప్రతాపరెడ్డి, దేవీ ప్రసాద్, బాలమల్లు, మన్నె గోవర్ధన్‌రెడ్డి, కిశోర్‌గౌడ్, చిరుమళ్ల రాకేశ్, దూగుంట్ల నరేశ్ పాల్గొన్నారు.

> మానకొండూర్ సభలో రేవంత్‌రెడ్డీ నువ్వు రుణమాఫీ ఎగ్గొట్టినవ్.. రైతుబంధు ఎగ్గొట్టినవ్.. తులం బంగారం ఎగ్గొట్టినవ్.. మహిళలకు మహాలక్ష్మి ఎగ్గొట్టినవ్.. వృద్ధులకు 4 వేల ఆసరా పింఛన్ ఎగ్గొట్టినవ్.. నీ పేరు ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు, ఎగవేతల రేవంత్‌రెడ్డి అన్నందుకు అక్కడి పోలీస్‌స్టేషన్‌లో నామీద కేసు పెట్టిండు. ఎగ్గొట్టినోన్ని ఎగ్గొట్టిండు అంటే కూడా తప్పేనా? ఇప్పుడు పోలీస్‌స్టేషన్‌కు రమ్మని నాకు నోటీసులు వస్తున్నయి. నువ్వు ఎగ్గొట్టింది నిజం కాదా? నువ్వు కోతలు పెట్టింది నిజం కాదా? ఏడాదిలో ఏం చేసినవ్ నువ్వు? పబ్లిక్ అటెన్షన్ డైవర్షన్ తప్ప? -హరీశ్‌రావు

## కేసీఆర్, హరీశ్‌పై కేసులో స్టే పొడిగింపు

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుపై దాఖలైన ప్రైవేటు ఫిర్యాదుపై విచారణ చేపట్టాలని భూపాలపల్లి ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి తీసుకున్న నిర్ణయాన్ని నిలిపివేస్తూ గత నెల 24న జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు మరోసారి పొడిగించింది. ఈ మేరకు జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కింది కోర్టులో ప్రైవేటు పిటిషన్ వేసిన సామాజిక కార్యకర్త నాగవల్లి రాజలింగమూర్తి తన వాదనలతో కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కావాలని ఆయన న్యాయవాది కోరడంతో తదుపరి విచారణ ఈ నెల 22కి వాయిదా పడింది.

## కక్ష సాధింపుతోనే కేటీఆర్‌పై కేసు

ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు: గంగుల



కొత్తపల్లి, జనవరి 8: రాజకీయ కక్షసాధింపులో భాగంగానే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు నమోదు చేస్తున్నదని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. బుధవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. అధికారం ఉన్నదని.. బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమంగా కేసులు బనాయిస్తూ కాంగ్రెస్ భయాందోళనలకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమపై ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని అన్నారు. న్యాయస్థానాలపై తమకు అపారమైన నమ్మకం ఉన్నదని తెలిపారు. ఈ-కార్ రేసు కేసులో కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఫార్ములా రేస్ ద్వారా తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచే విధంగా కేటీఆర్ కృషి చేసినట్టు తెలిపారు.

## హామీలు నెరవేర్చలేక కేసులు: కోటిరెడ్డి



నల్లగొండ, జనవరి 8 : తెలంగాణను ప్రపంచ పటంలో నిలబెట్టిన మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బద్నాం చేసి జైలులో పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి కుట్రపన్నుతున్నాడని ఎమ్మెల్సీ కోటిరెడ్డి విమర్శించారు. కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టాలనే దుర్బుద్ధితో ఈ-కార్ రేస్ అంశాన్ని బటయకు తీసి ఏసీబీ, ఈడీలను రంగంలోకి దింపాడని మండిపడ్డారు. బుధవారం ఆయన నల్లగొండలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు ఇకనైనా కుట్రలు మాని ఆరు గ్యారెంటీలు, రుణమాఫీ చేయడంతోపాటు రైతు భరోసా ఎకరాకు రూ.7,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీల్లో రైతు భరోసా రూ.7,500 ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.6వేలకు తగ్గించటమేంటని ప్రశ్నించారు.



సంగారెడ్డి జిల్లా జోగిపేటలో నోటికి గుడ్డలు కట్టుకొని ర్యాలీలో పాల్గొన్న చంటి క్రాంతికిరణ్, పార్టీ శ్రేణులు

## హామీలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి ధ్వజం

అందోల్, జనవరి 8: ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడాన్ని ప్రశ్నించిన బీఆర్‌ఎస్ నేతలపై ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నదని సంగారెడ్డి జిల్లా అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ విమర్శించారు. రైతుభరోసా రూ.15 వేలు చెల్లించాలని, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు బీఆర్‌ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టడం మానుకోవాలని, ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం జోగిపేటలో నోటికి నల్ల గుడ్డలు కట్టుకుని శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా చంటి క్రాంతికిరణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

## ముగిసిన అర్వింద్‌కుమార్, బీఎల్‌ఎన్ రెడ్డి విచారణ

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో రాష్ట్ర అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల విచారణకు బుధవారం అర్వింద్‌కుమార్, బీఎల్‌ఎన్ రెడ్డి హాజరయ్యారు. హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ అయిన బీఎల్‌ఎన్‌రెడ్డిని ఈడీ అధికారులు, ఎంఏయూడీ మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ సీనియర్ అయిన ఐఏఎస్ అర్వింద్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు విచారించారు. అరవింద్‌కుమార్‌ను ఐదుగురితో కూడిన ఏసీబీ విచారణ బృందం ఆరున్నర గంటలపాటు ప్రశ్నించినట్టు సమాచారం. ఇదే కేసులో మనీ లాండరింగ్, ఫెమా నిబంధనల ఉల్లంఘన అభియోగాల నేపథ్యంలో బీఎల్‌ఎన్ రెడ్డిని ఈడీ అధికారులు బుధవారం ఎనిమిదిన్నర గంటలపాటు విచారించారు.

# విచారణ సమయంలో కేటీఆర్ వెంట న్యాయవాది

- కనిపించేంత దూరంలో ఉంచాలని ఏసీబీ అధికారులకు హైకోర్టు ఆదేశం
- విచారణ తీరుపై అనుమానాలుంటే మళ్లీ కోర్టుకు రావచ్చన్న జస్టిస్ లక్ష్మణ్

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) విచారణకు హాజరయ్యేందుకు వెళ్లిన బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) వెంట న్యాయవాదిని అనుమతించకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. కేటీఆర్ వెంట న్యాయవాదిని అనుమతించాలని ఏసీబీని ఆదేశించింది. కేటీఆర్‌ను విచారించే ఏసీబీ కార్యాలయంలో దర్యాప్తు గదికి పక్కనే ఉన్న గ్రంథాలయ గదిలో న్యాయవాది ఉండేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. దర్యాప్తు ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలన్న ప్రతిపాదన పట్ల సానుకూలంగా స్పందించలేదు. గురువారం జరిగే విచారణ తీరును బట్టి అవసరమైతే పిటిషనర్ మళ్లీ కోర్టుకు రావచ్చని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 6 న ఏసీబీ దర్యాప్తుకు న్యాయవాదిని వెంటబెట్టుకుని వెళ్తే పోలీసులు అనుమతించకపోవడాన్ని సవాలు చేస్తూ కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై బుధవారం భోజన విరామ సమయంలో హైకోర్టు అత్యవసర విచారణ జరిపింది. కేటీఆర్ తరపున సీనియర్ న్యాయవాది ప్రభాకర్‌రావు వాదన వినిపిస్తూ.. ఏసీబీ విచారణ ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలని కోరారు. అందుకు జస్టిస్ లక్ష్మణ్ నిరాకరిస్తూ.. విచారణను న్యాయవాది సమక్షంలో జరిపించాలో లేక విచారణ ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్ చేయించాలో తేల్చుకోవాలని, ఈ రెండింటిలో ఒక్క వెసులుబాటు మాత్రమే కల్పించగలమని స్పష్టం చేశారు. ఏపీకి చెందిన వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి కేసులో ఈ రెండు వెసులుబాట్లు కల్పించారని ప్రభాకర్‌రావు గుర్తు చేయడంతో.. అవినాశ్‌రెడ్డి కేసును ఐపీఎస్ అధికారి దర్యాప్తు చేశారని, అవినాశ్‌రెడ్డి స్టేట్‌మెంట్‌ను డిలీట్ చేశారని, లేని విషయాలను చేర్చారని తీవ్ర అభియోగాలు రావడంతోనే ఆ వెసులుబాట్లు కల్పించాల్సి వచ్చిందని తెలిపారు. ఈ నెల 9న కేటీఆర్ ఏసీబీ దర్యాప్తునకు వెళ్లాక ఏమైనా సందేహాలుంటే తిరిగి 10న హైకోర్టుకు రావచ్చని, అప్పటి వరకు పిటిషన్‌ను మనుగడలోనే ఉంచుతామని చెప్పారు. విచారణకు కేటీఆర్ వెంట వెళ్లేందుకు ఒక్క న్యాయవాదిని మాత్రమే అనుమతిస్తామని, అందుకోసం ముగ్గురు లేదా ఐదుగురు లాయర్ల పేర్లు ఇవ్వాలని న్యాయమూర్తి చెప్పడంతో.. సీనియర్ న్యాయవాది జే రామచందర్‌రావు (మాజీ అదనపు అడ్వకేట్ జనరల్) ఒక్కరి పేరునే ఇస్తున్నట్టు ప్రభాకర్‌రావు తెలిపారు. దీంతో ఏసీబీ విచారణ సమయంలో కేటీఆర్‌ను తన న్యాయవాదికి కనబడేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన జస్టిస్ లక్ష్మణ్.. కేటీఆర్ వాంగ్మూలం ఇచ్చేటప్పుడు గానీ, ఆయనను దర్యాప్తు అధికారి ప్రశ్నించేటప్పుడు గానీ న్యాయవాది జోక్యం చేసుకోడానికి వీల్లేదని స్పష్టం చేశారు.



**ఆడియో, వీడియో రికార్డింగ్ అవసరం లేదు..**

ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ రజనీకాంత్‌రెడ్డి వాదిస్తూ.. ఏసీబీ ఆఫీసులో దర్యాప్తు గదికి ఆనుకుని ఉన్న మరో గదిలో న్యాయవాది ఉంటే గాజు అద్దం కిటికీ ద్వారా కేటీఆర్‌ను చూసేందుకు వీలుంటుందని చెప్పారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. కేటీఆర్ వెంట న్యాయవాదిని అనుమతిస్తున్నందున విచారణ ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్ చేసేందుకు అనుమతించడ లేదని తెలిపారు. కేటీఆర్‌ను విచారించేటప్పుడు ఆ గదికి పక్కనే ఉన్న గ్రంథాలయంలో న్యాయవాది ఉండేలా చర్యలు చేపట్టాలని ఏసీబీని ఆదేశించారు. కేటీఆర్‌పై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారని సందేహించనక్కర్లేదని, స్టేట్‌మెంట్ నమోదుపై పిటిషనర్ అనుమానం వ్యక్తం చేస్తున్నందున ఆయన కంటికి కనిపించేంత దూరంలో న్యాయవాది ఉండేందుకు అనుమతిస్తున్నామని జస్టిస్ కే లక్ష్మణ్ వివరించారు. అయినప్పటికీ ఏసీబీ దర్యాప్తు ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలని కేటీఆర్ తరపు న్యాయవాదులు ప్రభాకర్‌రావు, టీవీ రమణారావు మరోసారి కోరారు. లగచర్ల కేసులో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని ప్రశ్నించినప్పుడు పోలీసులు తప్పుడు విధానాన్ని అనుసరించడం వల్లే ఈ విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలిపారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. ఈ నెల 9న ఏసీబీ జరిపే విచారణ తీరు, స్టేట్‌మెంట్ నమోదుపై పిటిషనర్‌కు ఏమైనా అనుమానాలుంటే తిరిగి 10న కోర్టును ఆశ్రయించవచ్చని, అప్పటి వరకు పిటిషన్‌ను మనుగడలో ఉంచుతామని స్పష్టం చేశారు.

## ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే..

### లంచ్ మోషన్ పిటిషన్‌లో కేటీఆర్

**ఏసీబీ విచారణ కోసం ఈ నెల 6న న్యాయవాదితో కలిసి వెళ్తే పోలీసులు అనుమతించలేదని, ఇది రాజ్యాంగంలోని 21, 22 అధికరణలకు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు వ్యతిరేకమని పేర్కొంటూ హైకోర్టులో కేటీఆర్ 8 పేజీల లంచ్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఆ పిటిషన్ వివరాలు ఇవీ..**

**'ఫార్ములా** ఈ-కార్ రేసుపై మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఫిర్యాదు మేరకు అవినీతి నిరోధక చట్టం-1988లోని 13(1)(ఏ), 13 (2) సెక్షన్లతోపాటు ఐపీసీలోని 409, 120ఏ సెక్షన్ల కింద ఎఫ్‌ఐఆర్ నమోదైంది. ఆ కేసు విచారణకు హాజరయ్యేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు ఏసీబీ కార్యాలయానికి వెళ్లిన నా వెంట న్యాయవాదిని అనుమతించలేదు. ఏసీబీ విచారణలో నేను చెప్పిన విషయాలను పోలీసులు తప్పుగా నమోదు చేసే అవకాశం ఉన్నందున నాతోపాటు న్యాయవాదిని వెంట తీసుకెళ్లేందుకు అనుమతించాలని కోరినప్పటికీ పోలీసులు ఒప్పుకోలేదు. ఈ కేసు దర్యాప్తునకు నేను సహకరిస్తున్నప్పటికీ పోలీసులు నా వెంట న్యాయవాదిని రానీయకుండా అడ్డుకున్నారు. ఈ నెల 9న విచారణకు హాజరుకావాలని పోలీసులు మరోసారి నోటీసులు జారీ చేశారు. విచారణకు హాజరయ్యేందుకు నేను సిద్ధంగానే ఉన్నా. కానీ, విచారణ సందర్భంగా నేను ఇచ్చే వాంగ్మూలంలో దర్యాప్తు అధికారి మార్పులు చేర్పులు చేసే అవకాశాలున్నాయి. పోలీసులు నా రాజకీయ జీవితంతో ఆడుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ప్రజల్లో మా పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా తప్పుడు కేసులు నమోదు చేయించేందుకు అధికార పార్టీ పెద్దలు పోలీసులను ఒత్తిడి చేస్తున్నారు. అధికార పార్టీని సంతోషపెట్టాలన్న ఉద్దేశంతో బీఆర్‌ఎస్ పార్టీని దెబ్బతీసేందుకు తప్పుడు సాక్ష్యాలను సృష్టిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతుంటే జీర్ణించుకోలేక అధికార పార్టీ నేతలు నాపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసు బనాయించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పాలకులను నిలదీయడంతోపాటు అధికార పార్టీ నాయకుల అకృత్యాలను బయటపెట్టేందుకు ప్రయత్నిస్తుండటం వల్లే ఇలాంటి కేసులను నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అకృత్యాలను బహిర్గతం చేయకుండా నిరోధించేందుకే నాపై తప్పుడు కేసులు పెట్టారు. నిరుడు లగచర్ల ఘటనపై నమోదైన కేసులో బొంరాస్‌పేట పోలీసులు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేసి, తప్పుడు స్టేట్‌మెంట్ నమోదు చేశారు. అధికార పార్టీ సీనియర్ నాయకుల ఆదేశాల మేరకే అలా జరిగింది. హుజూరాబాద్ ఎమ్మెల్యే. పాడికౌశిక్‌రెడ్డిపై నమోదైన కేసులో బంజారాహిల్స్ పోలీసులు కూడా ఇలాగే వ్యవహరించారు. ఇప్పుడు నా విషయంలో ఏసీబీ అధికారులు కూడా అదేవిధంగా చేస్తారన్న అనుమానాలు బలంగా ఉన్నాయి. తద్వారా నా ప్రతిష్ఠను దిగజార్చేందుకు, రాజకీయ జీవితాన్ని దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతున్నది. దీన్ని అడ్డుకోవాలి. ఏసీబీ విచారణ సమయంలో నాతోపాటు న్యాయవాదిని అనుమతిస్తే పక్షపాతానికి తావుండదు. విచారణ స్వేచ్ఛాయుతంగా, న్యాయబద్ధంగా జరుగుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని విచారణ సమయంలో నా వెంట న్యాయవాది ఉండేందుకు వీలుకల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలి. లేకుంటే నాకు కోలుకోలేని నష్టం జరగడంతోపాటు కష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉన్నది. నిందితుడిని విచారించేటప్పుడు న్యాయవాదిని అనుమతించాలని గతంలో సుప్రీంకోర్టు కూడా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఏసీబీ దర్యాప్తు ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా, రాజ్యాంగ అధికరణలకు వ్యతిరేకంగా జరగకుండా చూసేందుకు తగిన ఉత్తర్వులు జారీ చేయాలి' అని కేటీఆర్ తన పిటిషన్‌లో హైకోర్టును కోరారు.